VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


# కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 280
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
మంగళవారం 24 మార్చి 2026


## ఎల్పీజీ నుంచి పీఎన్జీకి మారేలా యాక్షన్ ప్లాన్

- శ్రీకాకుళం-కాకినాడ పైప్ లైన్ పునరుద్ధరణకు చర్యలు
- ఈ నెల 26వ తేదీ కల్లా పంట నష్టంపై నివేదిక ఇవ్వండి
- ఏఐ ఇంటిగ్రేషన్‌తో మెరుగైన ప్రజా సేవలకు ఆస్కారం
- ఆర్టీజీఎస్ సమీక్షలో అధికారులతో సీఎం చంద్రబాబు




**అమరావతి,కలంకౌంటర్ :** ప్రస్తుతం ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యను ఎదుర్కోవడానికి ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మళ్లడమే సరైన పరిష్కారమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దీనికి పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ), విద్యుత్ పరికరాల వినియోగం పెరిగేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రతీ ఇంటికీ పీఎన్జీ కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాలతో తలెత్తిన పంట నష్టంపై సోమవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో ముఖ్య మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణ కోసం 2.34 లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ 60 వేల మంది వినియోగదారులు మాత్రమే కనెక్షన్లు పొందారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అయితే దీనిని 100 శాతం వినియోగి ంచుకునేలా చూడటంతో పాటు, జిల్లాకు కనీసం 10 వేలకు తగ్గకు ండా నూతన కనెక్షన్లు ఇవ్వాలంటూ సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. శ్రీకాకుళం – కాకినాడ పైప్ లైన్ పునరుద్ధరణపై కేంద్ర మంత్రికి లేఖ రాయాలని చెప్పారు. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్‌కు వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వచ్చే కేబినెట్ సమావేశానికి 'నేచురల్ గ్యాస్ పాలసీ ఫర్ ప్రమోషన్ ఇన్ కమర్షియ ల్ సెక్టార్' విధానాన్ని తీసుకురావాలని చెప్పారు. గ్యాస్ సంక్షోభం విద్యుత్ రంగానికి ఒక అవకాశమని, ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు వంటివి ప్రత్యామ్నాయ వనరుగా వినియోగించేలా చూడాల న్నారు. విద్యా సంస్థలకు, ఆస్పత్రులు, అంగన్వాడీలు, అన్న క్యాంటిన్లు, హోటళ్లకు ప్రాధాన్యతా క్రమంలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరిగేలా చూడాలన్నారు. మరోవైపు గత ఐదు రోజులుగా గృహావసరాల కోసం రోజుకు సగటున 1.80 లక్షల సిలిండర్లు పంపి ణీ చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. మరో 14,444 మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. అటు అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో సంభవించిన పంట నష్టం ప్రాథమిక వివరాలపైనా ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. ఈ నెల 26వ తేదీ కల్లా పంట నష్టం అంచనా వేసి నివేదిక ఇవ్వాలని ఆదేశిం చారు. వ్యవసాయంలో జీఎస్డీపీ 40 శాతం, ఉత్పాదన 71 శాతం పెరగడంతో పంటల నిర్వహణ, పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలన్నారు.

**ఏఐ సాయంతో తిరుమలలో పెరిగిన దర్శనాలు..** టెక్నాలజీ వినియోగించడంతో అన్నింటా మంచి ఫలితాలు వస్తున్నాయని... దీనికి తిరుమలలో పెరిగిన దర్శనాల సంఖ్యనే నిదర్శనమని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారు. ఏఐ సాయంతో తిరుమలలో క్యూలైన్లు, భక్తుల రద్దీ... నిర్వహణ వల్ల నిరీక్షణ సమయం తగ్గిందని, దీంతో 20 శాతం వరకు భక్తులు అదనంగా దర్శనాలు చేసుకునే అవకాశం లభించిందన్నారు. ఇప్పుడు కొండపై ప్రసాదం బావుంది, దర్శనం బావుంది, శ్రీవారి సేవకులు, భక్తుల్లో సంతృప్తి పెరిగిందని అన్నారు. అత్యాధునిక ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ద్వారా తిరుమల ప్రసాదాల్లో న్యూట్రిషనల్ విలువలు, పదార్థాల క్వాలిటీ చెక్ చేస్తున్నామని, దీంతో భవిష్యత్‌లో కల్తీకి ఆస్కారం ఉండదని సీఎం అన్నారు. ఇదే తరహాలో మిగిలిన శాఖలు మెరుగైన ప్రజా సేవలకు ఏఐ ఇంటిగ్రేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఐఓటీ పరికరాలు, సెన్సార్లు, సీసీ టీవీ లాంటి వివరాలతో

- 2లో

## చంద్రబాబు అనే నేను చెబుతున్నా... దేశంలో పరిశ్రమలకు ఏపీనే బెస్ట్ ప్లేస్

- స్టీల్ ప్లాంట్‌కు ఫౌండేషన్ కాదు... స్టీల్ సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం
- దేశ ఉక్కు అవసరాలు తీర్చేలా ఏపీ అభివృద్ధి సాధిస్తోంది
- ఉత్తరాంధ్రకు ఊపు తెచ్చే ప్రాజెక్ట్... రాష్ట్రాన్ని ప్రగతి బాట పట్టించే ప్రాజెక్ట్
- రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడి... 1 లక్షకుపైగా ఉద్యోగాలు
- రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు
- AM-NS ఇండియా ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు








**అనకాపల్లి/పాయకరావు పేట,కలంకౌంటర్ :** అనకాపల్లిలో జరిగిన శంకుస్థాపన స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే కాదని... స్టీల్ సిటీ నిర్మాణం కోసమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏపీకి రావడం చాలా మంచి పరిణామమని.. అనకాపల్లి, ఉత్తరాంధ్ర ప్రాంతంతో పాటు రాష్ట్రం ప్రగతి వైపు పరుగులు పెట్టడానికి ఈ స్టీల్ ప్లాంట్ ఉపకరిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. చంద్రబాబు నాయుడు అనే నేను చెబుతున్నా... పరిశ్రమలకు ఏపీనే బెస్ట్ ప్లేస్ అంటూ సీఎం ప్రకటించారు. సోమవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు శంకుస్థాపన ఘనంగా జరిగింది. కేంద్రమంత్రి హెచ్‌డి కుమార స్వామి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ప్లాంట్ సంస్థకు చెందిన ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి శంకుపస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."20 నెలల్లోనే స్పీడ్

- 2లో

## పాలన బలంగా ఉంటేనే... పెట్టుబడులు బలంగా వస్తాయి

- కూటమి పాలనలో పెట్టుబడులు రాష్ట్రాన్ని వెతుక్కుంటూ వస్తున్నాయి
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో నమ్మకాన్ని పెంచాం
- ఉత్తరాంధ్ర దశ దిశ మారిపోనున్నాయి.
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్




**అనకాపల్లి/పాయకరావు పేట,కలంకౌంటర్ :** 'గత ప్రభుత్వంలో రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయి. ఇప్పుడు పెట్టుబడులు రాష్ట్రాన్ని వెతుక్కుంటూ వస్తున్నాయి. గత ఎన్నికల్లో నేను కోరుకున్న కూటమి నేడు ఉత్తరాంధ్ర ప్రాంతంలో లక్ష మందికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయి పెట్టుబడులు రావడానికి కారణమయ్యింద'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. '2024లో రాష్ట్ర ప్రజలకు చెప్పిన మాట ఇదే.. రాష్ట్రం బలంగా ఉండాలి.. రాష్ట్రంలోకి పెట్టుబడులు రావాలి.. అలా జరగాలి అంటే రాష్ట్రంలో దార్శనికత ఉన్న పటిష్టమైన నాయకత్వం ఉండాలని చెప్పాను. ఇప్పుడు పెట్టుబడులు వస్తున్నాయి' అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపంలో అలాంటి నాయకత్వం రాష్ట్రంలో ఉండబట్టే దేశంలో 25 శాతం పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ కి వస్తున్నాయన్నారు. సోమవారం అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండల పరిధిలో ఆర్సెలర్ మిత్తల్, నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో స్థాపించనున్న గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి , రాష్ట్ర ఐటి, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ , రాష్ట్ర, కేంద్ర మంత్రులతో కలసి పాల్గొన్నారు. ఉక్కు కర్మాగారం భూమి పూజ అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండల పరిధిలో నిర్మిస్తున్న ఆర్సెలర్ మిత్తల్, నిప్పన్ స్టీల్ ఇండియా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఆర్సెలర్ మిత్తల్, నిప్పన్ స్టీల్ ఇండియా రూ. 1.35 లక్షల కోట్లతో 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ భారీ కర్మాగారం ఉత్తరాంధ్ర ప్రాంత దశ దిశ మారిపోనున్నాయి. లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనుంది. దేశంలోనే అత్యాధునిక సాంకేతికతతో ఏర్పాటు కానున్న

- 4లో

## వంటగ్యాస్ లభ్యతపై ప్రజలు ఆందోళన చెందొద్దు కొరతను అధికమించే చర్యలు

- పర్యావరణ హితమైన ఇండక్షన్ స్టవ్స్,పైప్ గ్యాస్ పై ప్రజల్లో అవగాహనకు కృషి
- అకాల వర్షాలకు రైతులు నష్టపోకుండా ముందస్తు అలెర్ట్ సందేశాలతో హెచ్చరించాం
- అకాల వర్షాల పంటనష్టం అంచనాలను ఈనెల 26కు పూర్తి చేసి 31లోగా కలెక్టర్లు ప్రభుత్వానికి నివేధికలు పంపాలి.
- మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.
- వాట్సప్ గవర్నెర్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.
- రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి



**అమరావతి,కలంకౌంటర్ :** మధ్యప్రాశ్యంలో యుద్ధవాతావరణ నేపథ్యంలో గ్యాస్ లభ్యతలో అసమానతలు పెరిగాయని అయితే వంట గ్యాస్ సరఫరాపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వంట గ్యాస్ కొరతను అధిగమించేందుకు యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఉండవల్లి సిఎం క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు అంశాలపై దిశానిర్దేశం చేసిన వివరాలను మంత్రి పార్థసారథి ఏపీ సచివాలయం ప్రచార విభాగంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భాంగా మంత్రి మాట్లాడుతూ గ్యాస్ కొరతను అధిగమించడానికి ప్రత్యామ్నాయ మార్గాలైన ఇండక్షన్ స్టవ్ లు, పైప్ లైన్ గ్యాస్ కనెక్షన్లు పెంచడం వంటి చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేంశం చేశారన్నారు. ఇండక్షన్ స్టవ్ లను వాడేలా చేయడం,కంపెనీలు వాటి ఉత్పత్తి పెంచేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని తెలిపారు. పైప్ లైన్ గ్యాస్ సరఫరా విధానాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పైప్ లైన్ గ్యాస్ కోసం పైప్ లైన్ల ఏర్పాటుకు నిబంధనల పాటిస్తూ 24 గంటల్లో అవసరమైన అన్ని అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారన్నారు. ఎందుకంటే పైప్ లైన్ గ్యాస్ సరఫరాకు తక్కువ వ్యయం అవుతుందని,కాలుష్యం కూడా తగ్గుతుందని, సిలిండర్ గ్యాస్ తో పోల్చితే ధర కూడా తక్కువ ఉంటుందని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా వంట గ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నా మని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకు ముందుగానే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ((AI)టూల్స్ ద్వారా 57 రకాల అప్డేట్స్ ఇచ్చామని దీంతో రైతులు తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించడంతో నష్టం తీవ్రత తగ్గిపోయిందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. ఉదాహరణకు

- 2లో




# జనగణనలో పొరపాట్లకు తావివ్వొద్దు..

-కమిషనర్ ఎన్. మౌర్య



**తిరుపతి,కలంకౌంటర్** : జనగణనలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా, పటిష్టంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులు, సిబ్బందికి సూచించారు. జనాభా గణన 2027 పై కచ్చపి ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం కమిషనర్ ఎన్.మౌర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జనన గణన చేసేందుకు 25 మందిని ఎంపిక చేశామని వారికి మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మీరందరూ శ్రద్ధగా అన్ని విషయాలను నోట్ చేసుకుని మీ కింద వచ్చే వారికి తెలిపి క్షేత్రస్థాయిలో జనన గణన చేయాలని తెలిపారు. 16 సంవత్సరాల తరువాత జరుగుతున్న ఈ జననగణన లో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పటిష్టంగా నిర్వహించి సమగ్రమైన సమాచారాన్ని సేకరించాలని పిలుపునిచ్చారు. రెండు దశల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూదన్, మాస్టర్ ట్రైనర్లు రమాదేవి, సుధారాణి, ఉదయ్, తదితరులు ఉన్నారు.

# సర్కిల్ కార్యాలయం తనిఖీ






**పొదిలి (మార్కాపురం జిల్లా),కలంకౌంటర్** : పొదిలి సర్కిల్ కార్యాలయం తనిఖీ చేసిన మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు.

# వంటగ్యాస్ లభ్యతపై ప్రజలు ఆందోళన చెందొద్దు కొరతను అధికమించే చర్యలు

- పర్యావరణ హితమైన ఇండక్షన్ స్టవ్స్,పైప్ గ్యాస్ పై ప్రజల్లో అవగాహనకు కృషి
- అకాల వర్షాలకు రైతులు నష్టపోకుండా ముందస్తు అలెర్ట్ సందేశాలతో హెచ్చరించాం
- అకాల వర్షాల పంటనష్టం అంచనాలను ఈనెల 26కు పూర్తి చేసి 31లోగా కలెక్టర్లు ప్రభుత్వానికి నివేధికలు పంపాలి.
- మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.
- వాట్సప్ గవర్నెర్స్ సేవలను ప్రజలు సద్వినియోం చేసుకోవాలి.
- రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి

(మొదటిపేజీ తరువాయి)

మిర్చి కళ్లాల్లో ఆరబెట్టిన రైతాంగం మెసేజ్ అలెర్ట్ ల ద్వారా జాగ్రత్తపడి టార్పాలిన్ పట్టాలు కప్పి మిర్చి తడిచిపోకుండా కాపాడుకోగలిగారన్నారు.అలాగే హర్వేస్ట్ కూడా వేగంగా చేసి గోదాములకు సరుకును తరలించడంతో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు.అకాల వర్షాల పంటనష్టం అంచనాలను ఈనెల 26 నాటికి పూర్తి ఆవివరాలను ఈనెల 27 నుండి 29 వరకూ రైతు సేవా కేంద్రాల్లో డిస్ప్లే చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.ఈనెల 31 నాటికి పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి సమర్పించాలని జిల్లా కలక్టర్లను సియం ఆదేశించినట్టు వివరించారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రాధమిక సమాచారం మేరకు 13 వేల మంది వ్యవసాయ రైతులు,1800 మంది ఉద్యానవన రైతులు అకాల వర్షాలతో నష్ట పోయారని తెలుస్తోందని,9981 హెక్టార్లలో వ్యవసాయ,1381 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం జరిగిందన్నారు.పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. మొక్క జొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు.రాష్టంలో పంట దిగుబడి పెరగటం,ఇథనాల్ ప్యాక్టరీలు మొక్కజొన్న కొనుగోళ్లు తగ్గించడం వంటి కారణాలతో ధర తగ్గిందన్నారు.మొక్క జొన్న రైతులకు న్యాయం జరిగేలా కేంద్రం నుంచి నష్ట పరిహారం రాబట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని మంత్రి తెలిపారు. ఐవీఆర్ ఎస్ ద్వారా శాఖల పనితీరును అంచనా వేస్తూ నివేదికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి పార్థసారథి చెప్పారు.సాంకేతికతను వినియోగించి ప్రజల సమస్యలు సత్వరం పరిష్కారించేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం ఆదేశించారన్నారు.వాట్సప్ గవర్నెన్స్ ను ఎక్కువగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సాంకేతికత సాయంతో పుణ్యక్షేత్రాల్లో ఎక్కువ మంది దర్శనాలు చేసుకోగలుగుతున్నారని పేర్కొన్నారు.ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ లో 1000 వరకూ సేవలు అందుబాటులో ఉంచామని ప్రజలు వాట్సప్ గవర్నెన్స్ సేవలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లకోసం 10 లక్షల వరకు దరఖాస్తులు అందాయని వాటిలో 6.5లక్షల నుండి 7 లక్షల వరకు ధరఖాస్తులు అర్హత కల్గినవిగా అధికారులు గుర్తించారని మంత్రి పార్థసారథి తెలిపారు.పీఎంఎవై 2.0 పథకంలో భాగంగా ఇళ్లు లేని వారికి ఇళ్లు మంజూరు చేస్తామని హామి ఇచ్చారు.పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి పార్థసారథి తెలిపారు.

# చంద్రబాబు అనే నేను చెబుతున్నా.. దేశంలో పరిశ్రమలకు ఏపీనే బెస్ట్ ప్లేస్

- AM-NS ఇండియా ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు











(మొదటిపేజీ తరువాయి)

ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ పరిశ్రమ ఏర్పాటును శంకుస్థాపన చేసుకున్నాం. ఈ భారీ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షమంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఈ ప్రాజెక్టు రావడానికి కృషి చేసిన ఆదిత్య మిట్టల్, మంత్రి నారా లోకేష్‌ను అభినందిస్తున్నా. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం భూమిని ఇచ్చిన రైతులందరికీ ధన్యవాదాలు. రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది. రూ.1.35 లక్షల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సంస్థకు జాతీయ స్థాయిలోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా చాలా మంచి పేరుంది. ఇలాంటి సంస్థ ఏపీకి రావడం చాలా మంచి పరిణామం. అందుకే చెబుతున్నాను... ఇవాళ జరిగిన శంకుస్థాపన స్టీల్ ప్లాంట్ కోసం మాత్రమే కాదు... స్టీల్ సిటీకి జరిగిన శంకుస్థాపన. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్టు కూడా నిర్మాణం జరుగుతుంది. 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్టర్ ఫర్నేస్, డిసెంబరు నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నేస్ నిర్మాణం పూర్తి చేస్తారు. అలాగే జాతీయ రహదారిని అనుసంధానిస్తూ 4 లేన్ల రహదారి కూడా పూర్తి అవుతుంది. పరిశ్రమకు ముడి ఇనుము సరఫరా కోసం పైప్ లైన్ కూడా వేయబోతున్నారు. ఈ ప్లాంట్ కోసం పైప్ లైన్ వేయాలని ప్రధానిని కోరితే వెంటనే అంగీకరించారు. ఉక్కు ఉత్పత్తి ఒక్కటే కాదు ఆర్థిక లావాదేవీలతో విద్య, వైద్యం, ఉద్యోగాలతో ఈ ప్రాంత రూపు రేఖలు మారతాయి" అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**అనుమతులు వేగంగా ఇస్తాం... అదే వేగంతో అభివృద్ధి చేయండి..** "ఈ పరిశ్రమకు ఇంత వేగంగా భూసేకరణ, అనుమతులను ఒక్క ఏపీలోనే ఇచ్చాం. చంద్రబాబు అను నేను చెబుతున్నాను... దేశంలో పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతం ఆంధ్రప్రదేశ్. పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం, రాష్ట్రం ఉంది. నిపుణులు, మానవ వనరులు ఏపీకి మాత్రమే సొంతం. టూరిజం నుంచి డేటా సెంటర్ వరకూ, ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి తయారీ రంగం వరకూ అన్నింటికీ ఏపీలో మెండైన అవకాశాలు ఉన్నాయి. కొత్త ఆలోచనలతో వచ్చి అవకాశాలను అందిపుచ్చుకోవాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే నినాదాన్ని విజయవంతం చేస్తాం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావటం దేశంలో ఇదే తొలిసారి. బీపీసీఎల్ సహా పెద్ద పెద్ద పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలల్లోనే రాష్ట్రానికి 20.35 లక్షల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. విశాఖ ఎకనామిక్ రీజియన్ నాలెడ్జి ఎకానమీ, పోర్టులు, స్టీల్, డేటా సెంటర్లు, ఐటీ సెంటర్లు ఇలా కీలకమైన కేంద్రంగా విశాఖ






మారుతోంది. టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు పెట్టుబడి పెడుతున్నాయి. రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా ఉత్తరాంధ్ర మారుతుంది. పరిశ్రమలకు అవసరమైన నీటిని పోలవరం ద్వారా అందిస్తాం. కొత్తగా పోర్టులు, ఎయిర్ పోర్టులు వస్తున్నాయి. ఉత్తరాంధ్రలో మూలపేట పోర్టు, జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభిస్తాం. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి వేగంగా నిర్మాణం పూర్తి చేసుకునేందుకు సహకారం ఇస్తాం. ఈ పరిశ్రమ నిర్మాణంలో రైతులు తమ భూములను త్యాగం చేశారు. వారికి సహకారం అందించాలి. ఉక్కు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి, సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నందుకు ధన్యవాదాలు. మొదటిగా అనకాపల్లి జిల్లా యువతకు ఈ పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించాలి. ఆవిష్కరణల కోసం మెటలర్జీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నందుకు అభినందనలు" అని ముఖ్యమంత్రి అన్నారు.

**అభివృద్ధి చేస్తామని చెప్పాం... చేసి చూపిస్తున్నాం..** "ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే ఈ ప్రాజెక్టు సాకారమైంది. రాష్ట్రంపై ప్రధాని చూపిస్తున్న అభిమానానికి ఈ వేదిక పైనుంచి మరోసారి కృతజ్ఞతలు చెబుతున్నా. ప్రధాని మోదీ చెప్పిన జష్ట్రఅజ్ శీ రాష్ట్రఅజూ తయారీ విధానానికి ఏపీ తిరుగులేని వేదిక. ప్రధాని మోదీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలతో నేడు ఈ పరిశ్రమ రాష్ట్రానికి వచ్చింది. డబుల్ ఇంజన్ సర్కార్ విజయం ఇది. రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేస్తామని... నేను, పవన్ కళ్యాణ్ చెప్పాం. అభివృద్ధి-సంక్షేమం-సుపరిపాలన చేసి చూపిస్తున్నాం. ఏ పని తలపెట్టినా సంపూర్ణ మద్దతు ఇస్తున్న పవన్ కళ్యాణ్‌ను అభినందిస్తున్నా. మంత్రి లోకేష్ పరిశ్రమలు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు."అని సీఎం చెప్పారు.

**నైపుణ్యాభివృద్ధి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఒప్పందం..** యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పన, సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వంతో రెండు వేర్వేరు ఒప్పందాలను ఆర్సెలార్ మిట్టల్- నిప్పన్ స్టీల్ సంస్థ చేసుకున్నాయి. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా స్థానిక యువతకు నైపుణ్యాలు కల్పించేలా ఒక ఒప్పందం, ఆధునిక ఉత్పత్తి సామర్థ్యాలపై సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్ ఏర్పాటుకు మరో ఒప్పందం కుదుర్చుకున్నాయి. అత్యాధునిక మెటలర్జికల్ ఇనిస్టిట్యూట్ ద్వారా యువతకు మెరుగైన నైపుణ్యం, తయారీ సామర్థ్యాలను కల్పిస్తామని ఆర్సెలార్ మిట్టల్ - నిప్పన్ స్టీల్ ఇండియా చైర్మన్ ఆదిత్య మిట్టల్ ప్రకటించారు.

**ఎక్స్ పీరియన్స్ జోన్ సందర్శన..** శంకుస్థాపన కార్యక్రమానికి ముందు అదే ప్రాగంణంలో ఏర్పాటు చేసిన ఎక్స్ పీరియన్స్ జోన్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. సీఎంతోపాటు కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఎక్స్ పీరియన్స్ జోన్ ను సందర్శించారు. ఆవీ-చీూ ఇండియా ప్లాంట్ కు సంబంధించిన వివరాలు, ఉక్కు రంగంలో ఆవీ-చీూ ఇండియా సంస్థ ప్రగతి వంటి అంశాలపై ప్రదర్శించిన వీడియోలను తిలకించారు. దశల వారీగా ఏర్పాటు చేయబోయే స్టీల్ ప్లాంట్ మీనియేచర్ ను సీఎం, కేంద్ర మంత్రులు, డిప్యూటీ సీఎం, మంత్రులు తిలకించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, టీజీ భరత్, అచ్చెన్నాయుడు, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ సీఎం రమేష్, అనకాపల్లి జిల్లా ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఆర్సెలార్ మిట్టర్ ఎగ్జిక్యూటీవ్ ఛైర్మన్ లక్ష్మి మిట్టల్, ఆర్సెలార్ మిట్టల్ సీఈఓ ఆదిత్య మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్రతినిధులు, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారులు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి

-అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్





**మోపిదేవి,కలంకౌంటర్** : రహదారులు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తన పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా మంజూరు చేసిన గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మాణం చేపట్టిన ప్రధాన రహదారులను పరిశీలించారు. మోపిదేవి మండలంలో ఉపాధి నిధులు రూ.97 లక్షలతో నిర్మిస్తున్న మోపిదేవి- వెంకటాపురం ప్రధాన రహదారి నాణ్యతను పరిశీలించారు. ఉపాధి నిధులు రూ.49లక్షలు, జడ్పీటీసీ నిధులు రూ.15లక్షలు కలిపి రూ.64 లక్షలతో నిర్మిస్తున్న మోపిదేవి - కొక్కిలిగడ్డ ప్రధాన రహదారుల నిర్మాణ నాణ్యతను స్వయంగా పరిశీలించారు. రహదారులను నిబంధనలకు అనుగుణంగా కలకాలం మన్నేలా నిర్మించాలని ఎమ్మెల్యే సూచించారు. నూతన రోడ్లపై వ్యవసాయ సీజనులో దమ్ము ట్రాక్టర్లు రింగు లేకుండా రాకపోకలు సాగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ పగడాల సురేష్ బాబు, పీఆర్ ఏఈఈ బొప్పన శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్ బాబు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్పీజీ నుంచి పీఎన్జీకి మారేలా యాక్షన్ ప్లాన్

- శ్రీకాకుళం-కాకినాడ పైప్ లైన్ పునరుద్ధరణకు చర్యలు
- ఈ నెల 26వ తేదీ కల్లా పంట నష్టంపై నివేదిక ఇవ్వండి
- ఏఐ ఇంటిగ్రేషన్‌తో మెరుగైన ప్రజా సేవలకు ఆస్కారం
- ఆర్టీజీఎస్ సమీక్షలో అధికారులతో సీఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

త్వరితగతిన నిర్ణయాలు తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. డ్రోన్ల వినియోగం ద్వారా సాగు వ్యయం తగ్గించి, ఉత్పత్తి పెరిగేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. పొరుగు రాష్ట్రాల్లో డ్రోన్ల వినియోగంపైనా అధ్యయనం జరపాలన్నారు. రాష్ట్రంలో బ్యాండ్ విడ్త్ పెంచేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ శాఖలు అవేర్, డేటా వినియోగం ద్వారా ఉత్తమ ఫలితాలను సాధించేలా చూడటం కీలకమన్నారు. ఈ సమావేశానికి మంత్రులు కొలుసు పార్థ సారధి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

# పాఠశాలలు ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

● మోపిదేవి, వెంకటాపురం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పరిశీలన ● వెంకటాపురం ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయునిపై ఎమ్మెల్యే ఆగ్రహం ● పిల్లలతో బట్టి పట్టించవద్దని స్పష్టం చేసిన ఎమ్మెల్యే ● పాఠ్య పుస్తకాలలో పాటలు కూడా నేర్పలేరా? అని ఆగ్రహం ● మోపిదేవి ఎంపీపీ స్కూల్లో మధ్యాహ్న భోజనం రుచి చూసి నాణ్యత పరిశీలించిన ఎమ్మెల్యే





**మోపిదేవి,కలంకౌంటర్ :** అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం మోపిదేవి, వెంకటాపురం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆకస్మిక తనిఖీ చేశారు. వెంకటాపురం జడ్పీ హైస్కూల్లో 6-9 తరగతుల విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి వారిని ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు ఎలా వ్రాస్తున్నారు? ఎంతమంది ఉత్తీర్ణులు అవుతారు? అని హెచ్ఎం లంకె సుభాషిణిని ప్రశ్నించారు. ఈ ఏడాది కూడా ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులయ్యేలా శ్రద్ధ వహిస్తున్నట్లు హెచ్ఎం తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులు అయ్యేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఇదే ప్రాంగణంలో ఉన్న ఎంపీపీ స్కూల్లో విద్యార్థుల పఠనా సామర్థ్యం పరిశీలించి, పిల్లలకు పాఠ్య పుస్తకాల్లోని పాటలు కూడా చూడకుండా పాడటం రాకపోవటంతో ఉపాధ్యాయునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలతో భట్టీ పట్టించవద్దని స్పష్టం చేసిన ఎమ్మెల్యే పాఠ్య పుస్తకాలలో పాటలు కూడా నేర్పలేరా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని జిల్లా విద్యా శాఖ అధికారి దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. అనంతరం మోపిదేవి ఎంపీపీ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పరిశీలించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ భోజనం రుచి చూసి నాణ్యత పరిశీలించారు. ఈ స్కూల్లో చక్కని తెలుగు పద్యాలు ఆలపించి ఆకట్టుకున్న నాలుగో తరగతి విద్యార్థిని పుష్ప హర్షితను అభినందించారు.

# రూ.6.43 కోట్లతో గ్రామీణ వైద్య రంగ బలోపేతం

● అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
● వెంకటాపురంలో గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి ఎమ్మెల్యే భూమిపూజ





**మోపిదేవి,కలంకౌంటర్ :** నియోజకవర్గంలో గ్రామీణ వైద్య రంగాన్ని రూ.6.43 కోట్లతో బలోపేతం చేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. సోమవారం మోపిదేవి మండలం వెంకటాపురంలో కేంద్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.36లక్షలతో నూతన గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.5.04 కోట్లతో 14 నూతన గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రూ.1.39 కోట్లతో నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న15 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్ర స్థలదాత, మాజీ సర్పంచ్ రావి వెంకటేశ్వరరావు దంపతులను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నడకుదుటి జనని కుమారి, టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, పంచాయతీ రాజ్ శాఖ డీఈ పగడాల సురేష్, ఏఈ బొప్పన శ్రీనివాసరావు, వైద్యాధికారి డాక్టర్ నంబూరి శ్రీరామ్ సాయి, హెల్త్ సూపర్ వైజర్ తోట సుధాకర్, ఎంపీహెచ్ఈఓ నందం బాబూరావు, హెల్త్ విజిటర్ విజయవల్లి, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ నాగలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రాంబాబు, ఏఎన్ఎం శైలజ, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం అందించాలి

–జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు





**మార్కాపురం,కలంకౌంటర్ :** ఫిర్యాదిదారుల సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం మార్కాపురం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ గారు "మీకోసం" ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను మార్కాపురం జిల్లా ఎస్పీ , పోలీస్ అధికారులు ఫిర్యాదిదారులతో ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగ సంబంధిత సమస్యలు, ఆన్‌లైన్ మోసాలు, భూ వివాదాలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను బాధితులు స్వేచ్ఛగా విన్నవించారు. ఫిర్యాదిదారుల సమస్యలను సవివరంగా విని, సానుకూలంగా స్పందించిన జిల్లా ఎస్పీ చట్టపరమైన చర్యలు తీసుకొని త్వరితగతిన న్యాయం అందిస్తామని భరోసా కల్పించారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫిర్యాదుదారుల వివరాలు తెలియజేసి, వారితో మాట్లాడించి, తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని ఆదేశించారు. మీకోసం కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును సత్వరంగా పరిష్కరించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వారిలో కొంత మంది వృద్ధులు, నడవలేని స్థితిలో ఉండేవారు ఫిర్యాదు చేయడానికి వస్తూ ఉంటారని, అలా వచ్చిన వారికి మర్యాదపూర్వకంగా వారి సమస్యలను విని సత్వర న్యాయం అందిస్తామని భరోసా వారిలో కలిగించాలని సిబ్బందికి తెలియజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను స్థానిక పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్–డివిజన్ కార్యాలయాలలో కూడా సమర్పించవచ్చని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ యు.నాగరాజు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, మార్కాపురం సీఐ సుబ్బారావు, పామూరు సీఐ శ్రీనివాసరావు, త్రిపురాంతకం సీఐ అస్సన్ , మార్కాపురం టౌన్ ఎస్సైలు సైదుబాబు, రూరల్ ఎస్సై వేమన ,సిబ్బంది పాల్గొన్నారు.

# గొప్ప సంఘ సంస్కర్త 'దొమ్మేటి' -రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**తాడేపల్లి/అమరావతి,కలంకౌంటర్ :** శెట్టి బలిజల పితామహుడు బొమ్మేటి వెంకటరెడ్డి గొప్ప సంఘ సంస్కర్త అని, ఆయన సేవలు నేటి యువతకు ఎంతో ఆదర్శమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. మహాత్మా గాంధీ కంటే ముందే వయోజన విద్య కోసం కృషి చేసిన మేధావన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి మంత్రి సవిత పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభివృద్ధికి, శెట్టిబలిజ సమాజ అభ్యున్నతికి, విద్యకు కృషి చేసిన మహనీయుడన్నారు. 1853 మార్చి 23న జన్మించిన దొమ్మేటి వెంకటరెడ్డి వయోజన విద్య వ్యాప్తికి విశేష కృషి చేశారన్నారు. 1905లో బర్మాలో శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి, ఆ సంఘం ద్వారా దేశంలో ప్రాథమిక పాఠశాలలు, గ్రంథాలయాలు, రాత్రి పాఠశాలలను నెలకొల్పారన్నారు. అనంతరం కోనసీమలో కూడా శెట్టి బలిజల ఐక్యతకు, వయోజన విద్యకు కృషి చేశారన్నారు. ఆనాటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలోనూ తనవంతు పాత్ర పోషించారన్నారు. తుది శ్వాస విడిచిపెట్టే వరకూ శెట్టిబలిజల ఐక్యతకు, వారి అభ్యున్నతికి పాటు పడ్డారన్నారు. వెంకటరెడ్డి పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎందో ఆదర్శమన్నారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు బీసీలు, శెట్టి బలిజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ, శెట్టి బలిజల పితామహుడు బొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవా దాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకు లు, కార్యకర్తలు, శెట్టి బలిజ సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

# కలం కౌంటర్ దినపత్రిక ఉగాది పంచాంగం ఆవిష్కరించిన ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ



**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** వత్సవాయిలో శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో కలం కౌంటర్ దినపత్రిక ఉగాది పంచాంగం ఆవిష్కరించిన ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ,ఎన్ టి ఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు రాజా , ఆర్యవైశ్య సంఘం నాయకులు. తొలుత వాసవి అమ్మవారి పాదాల వద్ద ఉంచి పత్రిక అభివృద్ధికి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.



# స్వాతంత్ర్య సమరయోధుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి వేడుకలు - అదనపు ఎస్పీ పి.సౌమ్యలత





**విజయనగరం,కలంకౌంటర్ :** జిల్లా పోలీసు కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ముఖ్య అతిథిగా హాజరై, దొమ్మేటి వెంకటరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి, పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత మాట్లాడుతూ – దొమ్మేటి వెంకటరెడ్డి భారత స్వాతంత్ర్య సమరంలో విశేష సేవలు అందించిన మహనీయులలో ఒకరని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన వారి త్యాగం, ధైర్యం మరియు దేశభక్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. దొమ్మేటి వెంకటరెడ్డి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య ఉద్యమాలలో చురుకుగా పాల్గొని ప్రజల్లో దేశభక్తి భావాలను పెంపొందించడానికి కృషి చేశారని గుర్తుచేశారు. దేశ స్వేచ్ఛ కోసం అనేక కష్టాలు, జైలు శిక్షలు ఎదుర్కొన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా పోరాడిన మహనీయుడని అన్నారు. వారి పోరాట స్ఫూర్తి యువతకు ప్రేరణగా నిలవాలని, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి సిఐ కే.కుమార స్వామి, రిజర్వు ఇన్స్పెక్టర్ ఎన్.గోపాల నాయుడు, డిపిఒ ఎఓ పి.శ్రీనివాసరావు, పలువురు ఎస్ఐలు, ఆర్.ఎస్.ఐ.లు,ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొని, చిత్ర పటానికి పుష్పాలు సమర్పించి, నివాళులు అర్పించారు.

# బీసీ హాస్టళ్లు, గురుకులా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

–బీసీ కళాశాల బాలికల హాస్టల్ ఆకస్మిక సందర్శన





**రాజమహేంద్రవరం,కలంకౌంటర్ :** బీసీ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాజమహేంద్రవరంలోని జమ్మపేట గణేశ్ చౌక్ వద్ద ఉన్న బీసీ కళాశాల బాలికల హాస్టల్ ను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి సోమవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్ గదులను, మరుగుదొడ్లను పరిశీలించారు. వంట గదిని పరిశీలించి, ఆహార పదార్థాలను రుచి చూశారు. అనంతరం విద్యార్థినులతో మంత్రి ముచ్చటించారు. బీసీ విద్యార్థుల విద్య కోసం కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. హాస్టల్‌లో మెరుగైన సదుపాయాలు కల్పించడానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తోందన్నారు. బీసీ హాస్టళ్లలో విద్యార్థినుల రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. స్వచ్ఛమైన తాగునీరందించడానికి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సక్రమంగా మెనూ అమలు చేస్తున్నారా...లేదా..? విద్యార్థినులను మంత్రి సవిత తిగి తెలుసుకున్నారు. హాస్టల్ ప్రాంగణంలో కరివేపాకు, మునగచెట్లు వేయాలని వార్డెన్ కు మంత్రి సవిత సూచించారు. అనంతరం మంత్రి సవిత తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, బీసీ హాస్టళు , గురుకులాల అభివృద్ధిపై సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్నామన్నారు.

